

అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్

## మహిళల సంక్షేమానికి పెద్దపీట

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

షాద్‌నగర్‌రూరల్, మే16 : మహిళల సంక్షేమానికి సర్కార్ పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని అన్నారం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మొదటగా గ్రామంలోని అంబేద్కర్, గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం మహిళలకే అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు సర్కార్ పక్క ప్రణాళికతో అడుగులు వేస్తుందన్నారు. మహిళల కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకానికి రూ.4305 కోట్లు, గృహ జ్యోతి పథకానికి రూ.2080 కోట్లు, గ్యాస్ సిలిండర్ల సబ్సిడీకి రూ.732 కోట్లు ఇలా మొత్తం రూ.5684 కోట్లు వెచ్చించిందన్నారు. అనంతరం ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అదేవిధంగా గ్రామంలో రాజ్యాంగానికి సంబంధించిన పుస్తకాలను ప్రదర్శించి, భారీ ర్యాలీ తీశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీధి కుక్కల బెడదకు చెక్

షాద్‌నగర్‌టౌన్, మే 16: షాద్‌నగర్ పట్టణ శివారులోని డంపింగ్‌యార్డ్ ఆవరణలో ఏర్పాటు చేసిన వీధి కుక్కల సంతాన నియంత్రణ కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీలో వీధి కుక్కల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీటి నివారణకు మున్సిపల్ నిధులు సుమారు రూ. 25లక్షలతో వీధి కుక్కల సంతాన నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు తిరుపతిరెడ్డి, బస్వం, ఇబ్రహీం, జమృత్, మాధవులు, దిలీప్ పాల్గొన్నారు.

# పంట మార్పిడి విధానాన్ని పాటించాలి

**గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు**



షాబాద్: తిమ్మారెడ్డిగూడలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త సతీశ్

షాబాద్, మే 16: రైతులు పంట మార్పిడి విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం వ్యవసాయ శాస్త్రవేత్తలు శిరీష, సతీశ్, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని మద్దూరు, తిమ్మారెడ్డిగూడ గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త శిరీష మాట్లాడుతూ... పంటలకు యూరియా వాడకాన్ని తగ్గించాలని సూచించారు. విత్తనాలు, పురుగుల మందులు కొనుగోలు చేసి సంబంధిత రసీదులు భద్రపర్చుకోవాలన్నారు. పంట మార్పిడి విధానాన్ని పాటించాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సతీశ్ మాట్లాడుతూ... వరి, పత్తి, కుసుమ, కంది తదితర పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఆర్థిక శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు పండిస్తున్న ప్రధాన పంటల మార్కెటింగ్ గురించి వివరించారు.



తుర్కయాంజాల్ : అవగాహన సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు తదితరులు



ఆమనగల్లు: సంకటోనిపల్లిలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం, పశు సంవర్ధకశాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పాండు, సహకార సంఘం వైస్ చైర్మన్ మల్లేశ్, శాస్త్రవేత్త అర్చన, విశ్వవిద్యాలయం రీసెర్చ్ స్కాలర్స్ అవనీజ, ఉమ, ఏఈవోలు రాజేశ్వరి, గీత, ప్రవీణ్‌కుమార్, స్నేహ, మాజీ సర్పంచులు నరేందర్‌రెడ్డి, శకుంతల, రైతులు పాల్గొన్నారు.

**రైతులకు శాస్త్రవేత్తల సూచనలు**

తుర్కయాంజాల్ : వరి సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి రావడానికి అవకాశం ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖలు సంయుక్తంగా చేపట్టిన రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం శుక్రవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి కొహెడలోని వార్డు కార్యాలయంలో నిర్వహించి రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిలో ఒకే రకమైన పంటను సాగు చేయకుండా పంట మార్పిడిని పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు,రైతులు పాల్గొన్నారు.

**ఆమనగల్లులో..**

ఆమనగల్లు : ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లి గ్రామంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయం శాస్త్రవేత్తలు నిర్మల, సుజాత ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించే సేంద్రియ వ్యవసాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు స్వప్నశ్రీ, భరత్ మండల వ్యవసాయ అధికారిణి అరుణకుమారి, విస్తరణ అధికారులు రైతులు కమతం వెంకటయ్య, దావ ధనంజయ, అనంతరాములు, శ్రీపాల్ పాల్గొన్నారు.

**నాణ్యమైన విత్తనాలను వాడాలి**

కడ్తాల్, మే 16: ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు అధిక దిగుబడి రావాలంటే రైతులు నాణ్యమైన విత్తనాలను వాడాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు విద్యాసాగర్, అనిత, సుప్రజ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని న్యామతాపూర్, నాగిరెడ్డిగూడ గ్రామాల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధునిక వ్యవసాయంపై రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలతోపాటు వర్మీకంపోస్టు, పచ్చి రొట్ట ఎరువులను వాడాలన్నారు. సాగు నీటి ఎద్దడిని నివారించడానికి బిందు సేద్యం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత, ఏఈవో అనూష, వీపీఎస్ బాలునాయక్, రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి



డిప్యూటీ తహసీల్దార్ మధుకు వినతిపత్రం అందజేస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు యాదవరెడ్డి తదితరులు

షాబాద్, మే 16: సర్దార్‌నగర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని భారతీయ కిసాన్ సంఘ్ షాబాద్ మండల అధ్యక్షుడు యాదవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో డిప్యూటీ తహసీల్దార్ మధుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడం సరికాదన్నారు. ఈ ప్రాంతంలో వడ్లు పండించిన రైతులు బయటి మార్కెట్‌లో రూ.1500 నుంచి రూ.1800 వరకు క్వింటాల్ ధర అమ్ముకుంటూ నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రూ.500 బోనస్ నష్టపోతున్నారని వాపోయారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సర్దార్‌నగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి వడ్లు సేకరించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లయ్య, చంద్రయ్య, నర్సింహులు, సత్యంగౌడ్, కృష్ణ, చంద్రకళ పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం



యాచారం, మే16: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ సీఐ కృష్ణంరాజు సూచించారు. మండలంలోని మేడిపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం రాచకొండ పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సును నిర్వహించారు. సీసీ కెమెరాల ఏర్పాటు, సైబర్ క్రైమ్, డ్రగ్స్, చైన్ స్నాచింగ్, మహిళలు, యువతులపై జరుగుతున్న దాడులు, దొంగతనాలు, కిడ్నాప్‌లు, అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల సరఫరా, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ రూల్స్ తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వ్యాపార సంస్థలు, దుకాణాలు, కార్యాలయాల యజమానులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అక్రమ రవాణా చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. డ్రగ్స్, మాదకద్రవ్యాలు విక్రయించినా, వినియోగించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా గంజాయి, ఆన్‌లైన్ గేమ్స్, పేకాట తదితర వాటికి యువత దూరంగా ఉండాలని సూచించారు. మహిళలు, బాలికలను ఆకతాయిలు వేధిస్తే షీటీంను ఆశ్రయించాలని కోరారు. ట్రాఫిక్‌రూల్స్ పాటించి రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శివలీల రమేష్, మాజీ వార్డు సభ్యులు, పోలీస్ సిబ్బంది, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# పరిసరాల శుభ్రతకు కృషి చేయాలి



ఇబ్రహీంపట్నం: డెంగీ నివారణ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

ఇబ్రహీంపట్నం, మే 16 : డెంగీ వ్యాధిని నివారించేందుకు కృషి చేయాలని వైద్యాధికారి సరిత, హేమలాల్ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. దోమలు అన్ని రకాల నిల్వ నీటిలో వృద్ధిచెందుతాయని, వాటి నివారణకు నిల్వ నీరు లేకుండా పూలకుండీ పాత్రలను ఎప్పటికప్పుడూ ఖాళీచేస్తూ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రతను పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



ఆమనగల్లు ప్రభుత్వ దవాఖానాలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి మంజులాదేవి

ఆమనగల్లు : డెంగీ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమనగల్లు ప్రభుత్వ దవాఖాన వైద్యాధికారి మంజులాదేవి అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమనగల్లు ప్రభుత్వ దవాఖాన వైద్యురాలు మంజులాదేవి ఆధ్వర్యంలో పట్టణంలోని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా దవాఖానల్లో రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు, కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది డాక్టర్ రచన సింగ్, నాగేశ్వరి, యేసుమని, ఏక్సీబా, దేవేందర్, ఇందిరా, సీత, మాధవి, విజయ్‌కుమార్, శ్రీను, ఆశ వర్కర్లు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవిలో మొక్కలను సంరక్షించాలి



యాచారంలో మొక్కలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శైలజ

యాచారం, మే16: వేసవిలో నర్సరీ మొక్కలను తప్పనిసరిగా సంరక్షించాలని ఎంపీడీవో శైలజ అన్నారు. మండల కేంద్రంలో ఉన్న నర్సరీ మొక్కలను శుక్రవారం ఆమె పరిశీలించారు. మొక్కల పెంపకం తీరును నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం పనులను సైతం పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..నర్సరిలో మొక్కలకు నిత్యం క్రమం తప్పకుండా నీరందించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రతి నర్సరీకి గ్రీన్‌నెట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కూలీల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. గ్రామంలో ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈసీ శివశంకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య తదితరులున్నారు.

## రైతులు సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకెళ్లాలి



నందిగామ, మే 16 : మండలంలోని నర్సప్పగూడ గ్రామంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం తదితర అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి

మొయినాబాద్, మే16: రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రసీదులు పొందాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ ప్రధాన శాస్త్రవేత్తలు మాధవి, పి.లీలారాణి అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖలు సంయుక్తంగా గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్ గ్రామంలో రైతులకు పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి అనురాధ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రసీదులు పొందితే విత్తనాలు మొలకెత్తకపోయినా, పంట ఎదుగుదల సరిగ్గా లేకపోయినా నష్టపరిహారం పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు తయారు చేసే వరి విత్తనాలను గ్రామానికి ముగ్గురు రైతులకు ఇవ్వడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి అనురాధ తెలిపారు. ఆ విత్తనాల ద్వారా నాణ్యమైన విత్తనాలను తయారు చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో యూనివర్సిటీ పీహెచ్‌డీ విద్యార్థులు రాజ్‌కుమార్, నవ్య, అశోక్, గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి కుమార్, మాజీ సర్పంచ్ చంద్రయ్య, రైతులు ఎట్టయ్యగౌడ్, విక్రంరెడ్డి, బల్వంత్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, రవీందర్‌రెడ్డి, రాంరెడ్డి, నర్సింహాగౌడ్, గోపాల్‌యాదవ్, ఎండీ మోహిన్, అచ్చుత్‌రెడ్డి, బీరయ్య, సురేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రంగారెడ్డి, లక్ష్మయ్య, శ్రీశైలం, సత్యనారాయణలు తదితరులు పాల్గొన్నారు.

## ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

మొయినాబాద్, మే16 : ఉరివేసుకుని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన షకీనా, ఎండీ అలీ కూతురు షబానా బేగంతో పాటు షబానా బేగం భర్త జబీర్ ఓ ఫాంహౌస్‌లో నివాసం ఉంటూ సెక్యూరిటీగా పని చేస్తున్నారు. కాగా, ఈ నెల 15వ తేదీన రాత్రి 11 గంటల సమయంలో భోజనం చేసిన తరువాత షబానా బేగం గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. కుటుంబ సభ్యులు పిలిచినా పలుకకపోవడంతో అనుమానం వచ్చి కిటికీల్లోనుంచి చూడగా ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే ఆమెను చికిత్స కోసం నగరంలోని ఉస్మానియా దవాఖానకు తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే చనిపోయిందని నిర్ధారించారు. ఆమెకు కొంత కాలంగా ఆరోగ్యం బాగాలేదని, మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుందని పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

# పరిశ్రమలు స్థాపించే స్థాయికి ఎదుగాలి

**రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి**



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు బాలకృష్ణారెడ్డి, శ్రీరాములు తదితరులు

మొయినాబాద్, మే 16: ప్రపంచంలో నూతన ఆవిష్కరణలు రూపొందించాలంటే విద్యార్థులు ఔత్సాహిత ఆలోచన ధోరణిని పెంపొందించుకోవాలి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి అన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు గ్రామ రెవెన్యూలోని అరిస్టాటిల్ పీజీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఔత్సాహిత, ఆవిష్కరణ అంతర్జాతీయ సదస్సును శుక్రవారం ప్రారంభించారు. సదస్సుకు పారిశ్రామిక వేత్తలు, విద్యార్థులు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఔత్సాహిత పరిశ్రమలకు సంబంధించిన 296 పేపర్లను ప్రజెంటేషన్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిషత్‌లో ఔత్సాహిత పారిశ్రామిక వేత్తలుగా మారాలని, నూతన ఆవిష్కరణలు చేసి పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధిని కల్పించే స్థాయికి ఎదుగాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులు సామాజిక బాధ్యతను మేనేజ్‌మెంట్ విద్యలో భాగం చేయాలని చెప్పారు. పర్యావరణ అనుకూల పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి విద్యార్థులు నాయకత్వం వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ డీన్ సీనియర్ ప్రొఫెసర్ శ్రీరాములు, అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, కేజీరెడ్డి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మహా ధర్నాను జయప్రదం చేయండి

మాడ్గుల, మే16: మండల పరిధిలోని అప్పారెడ్డిపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలు పని చేస్తున్న ప్రదేశాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో ఉండే పేదలకు ఉపాధి హామీ చట్టాన్ని దూరం చేసే కుట్ర బీజేపీ ప్రభుత్వం చేస్తుందన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం దానిని విరమించుకోవాలని మే 30న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వ్యవసాయ, ఉపాధి హామీ కూలీలతో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాను జయప్రదం చేయాలని కూలీలను కోరారు. ప్రతి వారం డబ్బులు ఇవ్వాలి డిమాండ్ చేశారు. కార్యక్రమంలోని మండల కార్యదర్శి పాషా, బుచ్చయ్య, సంధ్య, వెంకటమ్మ, కృష్ణయ్య, పాపమ్మ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెద్దఅంబర్‌పేట, మే 16: నిర్వహణ పనుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పెద్దఅంబర్‌పేట ఏఈ జగన్ తెలిపారు. మధ్యాహ్నం వరకు 11 కేవీ గౌరెల్లి ఫీడర్, లక్ష్మీగణపతి ఫీడర్, కుంట్లూరు ఫీడర్లలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఆర్థికసాయం అందజేత

షాబాద్, మే 16: షాబాద్ మండలంలోని లక్ష్మారావుగూడ గ్రామంలో మేకల కిష్టమ్మ అనే మహిళ మృతిచెందింది. శుక్రవారం గ్రామానికి చెందిన శ్రీ మల్లికార్జున కురుమ సంఘం తరపున కిష్టమ్మ కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి శ్రీరంగాపురం కుమార్, సభ్యులు శ్రీశైలం, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తుల పరిష్కారానికి కృషి

**రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి**



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

ఆదిబట్ల, మే 16: పెన్షన్ అదాలత్‌లో వచ్చిన దరఖాస్తులను వెంటనే అకౌంటెంట్ జనరల్‌కు పంపించి వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తానని రంగారెడ్డి కలెక్టర్ సి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో పెన్షన్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచన్‌దారుల నుంచి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సమావేశంలో 27 శాఖలకు సంబంధించిన 93 పెన్షన్ పెండింగ్ దరఖాస్తులు 39 మంది పెన్షనర్లు, జీపీఎఫ్ చందాదారులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వారి సూచనల మేరకు సంబంధిత అధికారులతో చర్చించి వాటిపై కలెక్టర్ సూచనలు చేశారు. అనంతరం ఈ విషయంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎంఎస్ చందా, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ అభయ్ ఏ సోనార్కర్, జిల్లా ఖజానా అధికారి బి.పద్మావతి, జిల్లా రెవెన్యూ అధికారి టి.ఎల్ సంగీత, డిప్యూటీ డైరెక్టర్ రాజు, సంబంధిత అధికారులు, పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

## బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



చేవెళ్లటౌన్, మే 16: బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సూచించారు. శుక్రవారం చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

**అబ్దుల్లాపూర్‌మెట్ :** బడిబాటలో భాగంగా శుక్రవారం మన ఊరు – మన బడి కార్యక్రమాన్ని బాటసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదగిరి, మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంతోష నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరిగి పాఠశాలలోని విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, విద్యాబోధనల తీరును తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గౌరీశంకర్‌చారి, మాజీ వార్డుసభ్యుడు వెంకటేశ్‌గౌడ్, యువజన నాయకులు గోపి, నవీన్, ఉపాధ్యాయులు పుష్ప, పార్వతి, శ్రీలత, ప్రతాప్, శోభారాణి, ఉషారాణి తదితరులు ఉన్నారు.

## మహిళ మిస్సింగ్

ఆదిబట్ల, మే 16: మతిస్థిమితం లేని ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శుక్రవారం ఆదిబట్ల ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ గ్రామానికి చెందిన హంసమ్మ ఎత్తు 5.5, కలర్ చామనఛాయ, వయస్సు 29 సంవత్సరాలు. మతిస్థిమితం లేకపోవడంతో సోమవారం ఉదయం ఇంటినుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తమకు తెలిసిన ఇళ్లలో కుటుంబ సభ్యులు వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఆచూకీ కోసం 87126 62671, 8712662383లో సంప్రదించాలన్నారు.

## వ్యక్తి ఆత్మహత్య

చేవెళ్ల రూరల్, మే 16 : యువకుడు మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్న ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. చేవెళ్ల ఎస్ఐ శిరీష తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన కుమ్మరి బాబమ్మ, రాజు దంపతుల కుమారుడు కుమ్మరి రవి(22) బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చాడు. రాజేంద్రనగర్ నియోజకవర్గం నార్సింగి మున్సిపల్ పరిధిలో ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున చేవెళ్ల మండలం ముడిమ్యాల గ్రామంలోని కంచె(ఫారెస్ట్)లో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తమ కొడుకు మృతికి ప్రేమ వ్యవహారమే కారణం కావొచ్చని చేవెళ్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై శిరీష తెలిపారు.